
www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా / శ్రీ సత్యసాయి జిల్లా

# శివైక్యం చెందిన గవి మఠం పీఠాధిపతి



**ఉరవకొండ గవి మఠం 8వ పీఠాధిపతి చెన్న బసవ రాజేంద్ర స్వామి కన్నుమూత**

**నేడు అంత్యక్రియలు**

**నివాళులర్పించిన శ్రీరాములు,గాలి జనార్ధన్‌రెడ్డి,విశ్వేశ్వర్ రెడ్డి**

**ఉరవకొండ,జూలై18. అక్షర టైమ్స్:-** ఉరవకొండలోని శ్రీ గవి మఠం 8వ పీఠాధిపతి జగద్గురు శ్రీ చెన్న బసవ రాజేంద్ర స్వామి (చంద్రమౌళేశ్వర మహాస్వామి) శనివారం తెల్లవారుజామున కర్ణాటకలోని బళ్లారిలో శివైక్యం చెందారు. కొంతకాలంగా వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. స్వామివారి శివైక్య వార్త తెలియడంతో ఉరవకొండ పట్టణంతో పాటు రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల్లోని వేలాది మంది భక్తులు, శిష్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. బళ్లారిలోని ఆశ్రమం నుంచి స్వామివారి పార్థివదేహాన్ని ప్రత్యేక వాహనంలో ఉరవకొండకు తీసుకొచ్చి శ్రీ గవి మఠంలో భక్తుల సందర్శనార్థం ఉంచారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో మఠానికి చేరుకుని స్వామివారికి కన్నీటి నివాళు లర్పిస్తూ చివరి దర్శనం చేసుకుంటున్నారు. ఆదివారం మఠ ఆవరణలో లింగాయత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మఠం అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఏర్పాట్లు చేపట్టారు. స్వామివారి పార్థివదేహానికి కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి శ్రీరాములు, మాజీ మంత్రి గాలి జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు, సామాజిక సంస్థల ప్రతినిధులు నివాళు లర్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, శిష్యులు తరలివచ్చి స్వామివారి ఆశీస్సులను స్మరించుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఆధ్యాత్మిక బోధనలు, ధార్మిక సేవలు, సామాజిక చైతన్య కార్యక్రమాలతో చెన్న బసవ రాజేంద్ర స్వామి విశేష గుర్తింపు పొందారు. గవి మఠం అభివృద్ధికి విశేష కృషి చేయడంతో పాటు భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన శివైక్యంతో గవి మఠం గొప్ప ఆధ్యాత్మిక మార్గదర్శిని కోల్పోయిందని భక్తులు, శిష్యులు, పీఠాధిపతులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాదు పచ్చదనం, పరిశుభ్రత కూడా ముఖ్యం

**స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత**

**కుంటిమద్ది ప్రభుత్వ పాఠశాల వంటశాలకు మూడు లక్షల రూపాయల కేటాయింపు**

**పాపిరెడ్డిపల్లిలో రూ.80లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు ప్రారంభం**

**ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామన్న ఎమ్మెల్యే సునీత**





**అనంతపురం,జూలై18.అక్షర టైమ్స్:-** అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు పచ్చదనం పరిశుభ్రతను కూడా ప్రాధాన్యతగా తీసుకొని తమ ప్రభుత్వం పని చేస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఇందులో భాగంగా ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. రామగిరి మండలం కుంటిమద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, పారిశుధ్య కార్మికులు, స్థానిక నాయకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఇంకుడు గుంత తవ్వడానికి భూమి పూజ చేశారు. తడి చెత్త - పొడి చెత్తను వేరు చేయు విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆ తర్వాత పాఠశాల మొత్తం ఆమె పరిశీలించారు. వంటగది లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ప్రధానోపాధ్యాయులు ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకెళ్లారు. వంటగది నిర్మాణానికి ఎంత మేర ఖర్చవుతుందని ఆరా తీశారు. వెంటనే ఆమె స్పందించి మండల పరిషత్ నుంచి మూడు లక్షల రూపాయలతో వంటగది నిర్మించాలని ఎంపీడీఓని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత పై పాఠశాల స్థాయి నుంచి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి తడి, పొడి చెత్త వేరు చేయు విధానం గురించి తెలిస్తే వారి ఇళ్లలో కూడా చెబుతారన్నారు. పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనం విషయంలో కూడా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను కాపాడే విధంగా విద్యార్థులకు బాధ్యతలు అప్పగించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

**రూ. 80లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత**

రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. గ్రామ సమీపాన వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం వద్ద 45లక్షల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన రోడ్డు వద్ద ఎమ్మెల్యే సునీతకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపిస్తూ పాదయాత్రతో రోడ్డు మార్గం మీదుగా ఆలయానికి వెళ్లారు. అక్కడ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి భజన కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులతో కలిసి భోంచేశారు. అనంతరం పాపిరెడ్డిపల్లి గ్రామంలో 35 లక్షల ఎన్ఆర్ఈజీఎస్, డిఎంఎఫ్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి సమస్యగా ఉన్న రోడ్లను నిర్మించినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో బిటి, సిసి రోడ్లతో పాటు ఆలయం వద్ద కూడా రోడ్డు నిర్మించినట్లు చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరిగింది.. ఇప్పుడు ఏం జరుగుతోందన్నది ప్రజలు గుర్తించాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు.

# ప్రజలపై చెత్త పన్ను వేసి 85లక్షల టన్నులు చెత్త పెట్టిపోయారు

**అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి**

**స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బల్క్ వ్యర్థాలపై అవగాహన**

**ఆసుపత్రుల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తే చర్యలు తప్పవు**

**త్వరలోనే డంపింగ్ యార్డ్ లో వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్, పార్కు ఏర్పాటు చేస్తాం**

**30ఏళ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నాం.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**





**అనంతపురం,జూలై18.అక్షర టైమ్స్:-** రాష్ట్రంలో గత ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజలపై చెత్త పన్ను వేసి.. 85 లక్షల టన్నుల చెత్తను పెట్టి పోయారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అనంతపురం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్ లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ వారం ప్రభుత్వ ఆదేశాల మేరకు బల్క్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, కల్యాణమండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి.. చెత్త నిర్వహణకు సంబంధించి కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జస్వంత్ కుమార్, ఎంహెచ్ఓ రాజా రవీంద్ర, పొల్యూషన్ బోర్డు అధికారి శశికళతో పాటు పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు. హోటళ్లు, అపార్ట్మెంట్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, కల్యాణ మండపాలు, షాపింగ్ కాంప్లెక్స్ ల నిర్వాహకులు వ్యర్థ పదార్థాల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలను వేరువేరుగా ఉంచాలన్నారు. తడి వ్యర్థాలను వీలైతే తమ ప్రాంగణంలోనే కంపోస్టింగ్ లేదా బయోగ్యాస్ ద్వారా శుద్ధి చేయాలని చెప్పారు. ఇలా చేయడం వలన మున్సిపాలిటీ పై భారం తగ్గి.. పర్యావరణ పరిరక్షణకు దోహదపడినట్లు అవుతుందన్నారు. పొడి వ్యర్థాలను మాత్రమే అందించాలని తడి, పొడి చెత్తను కలిపి మున్సిపల్ వాహనాలకు ఇస్తే అది పెద్ద భారంగా మారుతుందన్నారు. చెత్తను సక్రమంగా వేరు చేస్తే నగర పరిశుభ్రతకు ఎంతో ఉపయోగపడిన వారవుతారని సూచించారు. మరోవైపు ఆస్పత్రుల నిర్వాహకులు వ్యర్థాలను మున్సిపల్ వాహనాలకు అందిస్తున్నారని.. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఆసుపత్రిలో వ్యర్థాలను కొన్ని ప్రమాణాల ప్రకారం వేరు చేయాల్సి ఉంటుందని చెప్పారు. వీటి విషయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతినిత్యం ఆసుపత్రులను తనిఖీ చేసి వారు చెత్తను ఏ విధంగా చేస్తున్నారన్నది పరిశీలించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు గత ప్రభుత్వంలో ఎప్పుడు చెత్త నిర్వహణపై దృష్టి సారించలేదని.. కేవలం ప్రజలపై చెత్త పన్ను భారం వేశారని ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు చేశారు. 85 లక్షల టన్నులు చేత పెట్టిపోతే.. 2024 అక్టోబర్-2 తేదీ నుంచి ఈ చెత్తను క్లియర్ చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందన్నారు. ఇప్పటికే 70 లక్షల టన్నుల చేతను తీసివేశారన్నారు. అనంతపురం నగరంలోని డంపింగ్ యార్డులో కూడా మూడున్నర లక్షల చెత్త ఉంటే అందులో ఇప్పటికే రెండున్నర లక్షల టన్నుల చెత్త తీసి వేశామని.. మిగిలిన చెత్తను తొలగించి త్వరలోనే ఇక్కడ ఒక వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్లాంట్ ఒకటిన్నర ఎకరాల్లో ఉంటుందని... మిగిలిన మొత్తం 10 ఎకరాల్లో ఒక పార్కును కూడా నిర్మించబోతున్నట్లు చెప్పారు. ఇందుకోసం త్వరలోనే టెండర్లు పిలుస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. గత వైసిపి పాలకవర్గం పోయినప్పటి నుంచి జిల్లా కలెక్టర్, కమిషనర్ అనునిత్యం నగరంలో పరిశుభ్రత కోసం, ప్రజా సమస్యల మీద దృష్టి సారించాలన్నారు. అందుకే ఈ నాలుగైదు నెలల్లో పెద్ద ఎత్తున మార్పులు కనిపిస్తున్నాయన్నారు. వర్షాకాలం వస్తే కొన్ని కాలనీల్లో నీరు చేరుతోందని.. దీనికి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల నుంచి ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరిస్తేనే అనంతపురం నగరం పరిశుభ్రంగా ఉంటుందని తెలిపారు. మరోవైపు కమిషనర్ జస్వంత్ కుమార్ మాట్లాడుతూ.. నగరంలో ప్లాస్టిక్ నిర్మూలన కోసం ఎప్పటికప్పుడు రైడ్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అయితే కొన్నిచోట్ల సిబ్బందితో దుకాణదారులు గొడవలు దిగుతున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఇలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో ఆక్రమణల విషయంలో కూడా కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రులు, పెద్ద పెద్ద దుకాణాలు, అపార్ట్మెంట్ల వారు రోడ్లమీదకు వచ్చి ఆక్రమణలు చేస్తే వాటిని తొలగించడంలో రాజీపడమన్నారు. సంబంధిత వ్యాపారులను నష్టపరచాలన్న ఉద్దేశ్యం మున్సిపల్ అధికారులకు కానీ, ప్రజా ప్రతినిధులకు కానీ ఉండదని జస్వంత్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజలంతా సహకరించినప్పుడే నగరం బాగుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, క్లస్టర్ ఇంచార్జ్ లు సాకే లక్ష్మీనరసింహ, పొట్లూరి కేశవ నాయుడు, టిడిపి నాయకుడు నారాయణస్వామి యాదవ్, అధికారులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్లలను ఆవిష్కరించిన వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి





**గుంతకల్,జూలై18.అక్షర టైమ్స్:-(ప్రతినిధి గుమ్మనూరు హరి)** : గుంతకల్లు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే వై వెంకట రామిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో జగన్2.0 సూపర్ యాప్ పోస్టర్లను ఆవిష్కరించిన వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా పోస్టర్ ఆవిష్కరణ జరిగాయి ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతి రెడ్డి మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు ఈరోజు గుంతకల్ నియోజకవర్గం లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తలతో ప్రత్యక్ష అనుసంధానం మరియు ఆధునిక సాంకేతికత వినియోగానికి మరో ముందడుగుగా "జగన్ 2.0 సూపర్ యాప్" ను ప్రారంభించారు. వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరికీ ఒకే డిజిటల్ వేదికను అందించాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ యాప్ ద్వారా గ్రామ స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వం వరకు ప్రతి ఒక్కరూ ఒకే ప్లాట్‌ఫారమ్‌పై అనుసంధానమవుతారు. పార్టీ కార్యక్రమాలు, సమావేశాలు,శిక్షణా కార్యక్రమాలు, అధికారిక ప్రకటనలు, లైవ్ అప్డేట్లు, సోషల్ మీడియా ప్రచార కార్యక్రమాలు, ప్రజా సమస్యల నమోదు, నాయకత్వంతో ప్రత్యక్ష కమ్యూనికేషన్ వంటి అనేక సేవలు ఈ యాప్ ద్వారా అందుబాటులో ఉంటాయి. అలాగే పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా ప్రచార కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ పనితీరును నమోదు చేసుకునే అవకాశం కూడా కల్పించారు. ప్రజల సమస్యలను వేగంగా గుర్తించి వాటిపై పార్టీ స్పందించే విధంగా ప్రత్యేక వ్యవస్థను ఈ యాప్‌లో ఏర్పాటు చేశారు. "పార్టీకి బలం కార్యకర్తలే. ప్రతి కార్యకర్తతో నేరుగా అనుసంధానమై వారి సేవలను గుర్తించి, మరింత సమర్థవంతంగా పార్టీని ప్రజలకు చేరువ చేయడమే జగన్ 2.0 సూపర్ యాప్ లక్ష్యం" అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఈ యాప్‌లో మరిన్ని ఆధునిక సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని ప్రతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త జగన్ 2.0 సూపర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని డిజిటల్ ఉద్యమంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త చేతిలో జగన్ 2.0 సూపర్ యాప్ -- ప్రతి ఇంటికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సందేశం" అనే లక్ష్యంతో పార్టీ ముందుకు సాగుతోందని నాయకత్వం స్పష్టం చేసింది. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా వైస్సార్సీపీ నాయకులు,కార్యకర్తల ప్రశ్నించే గొంతును నొక్కే విధంగా కూటమి ప్రభుత్వం చేస్తుందని అన్నారు. ఎవరికి భయపడొద్దు అని వైసిపి కార్యకర్తలకు ధైర్యం చెప్పిన జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతి రెడ్డి ఈ యాప్ లో అన్యాయం జరిన ప్రతీ కార్యకర్త పిర్యాదులు చేయాలనీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ రాష్ట్ర,జిల్లా,పట్టణ, మండల, నియోజకవర్గం అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ ఫలితాల్లో 'తేజ' ప్రభంజనం

**ఆల్ ఇండియా ర్యాంకులో టి.నవనీత (1039), ఎస్.సిరివెన్నెల (2923)**

**విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించిన కళాశాల యాజమాన్యం**





**అనంతపురం,జూలై18.అక్షర టైమ్స్:-** జాతీయ స్థాయి వైద్య విద్యా ప్రవేశ పరీక్ష (నీట్) ఫలితాల్లో తేజ కళాశాల విద్యార్థులు టి.నవనీత ఆల్ ఇండియా 1039వ ర్యాంక్, సిరివెన్నెల ఆల్ ఇండియా 2923వ ర్యాంక్ సాధించి జిల్లా టాప్ ర్యాంక్ లు సాధించారు. అంతే కాకుండా 50 వేల లోపు 8 మంది, లక్షలోపు 15 మంది అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్, బీడీఎస్ లాంటి వైద్య విద్య సీట్లు సాధించబోతున్నారు. ఈ సందర్భంగా తేజ విద్యాసంస్థల డైరెక్టర్ తేజేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. జూనియర్ కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం నుంచి వరుసగా ప్రతి ఏడాది నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ లు క్రమం తప్పకుండా ప్రతి ఏటా సాధిస్తూ అనంతపురం జిల్లా కీర్తి ప్రతిష్టలను జాతీయ స్థాయిలో ఇనుమడింపజేస్తున్న విద్యార్థులకు, మా మీద నమ్మకం ఉంచి ఇంతటి ఘన విజయాలకు సహకరిస్తున్న తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మొన్న ఇంటర్ ఫలితాల్లో స్టేట్ టాప్ ర్యాంకులు, నిన్న జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో టాప్ ర్యాంకులు, నేడు అదే పరంపరను కొనసాగిస్తూ.. నీట్‌లో సైతం జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం మాకు మరింత బాధ్యతను పెంచాయని డైరెక్టర్ తేజేశ్వర్ రెడ్డి తెలిపారు. అంతే కాకుండా మొన్న ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో అఖిల రెడ్డి ఆల్ ఇండియా 217 ర్యాంక్, జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో భార్గవి ఆల్ ఇండియా 232, అఖిల 976 లాంటి అత్యుత్తమ ర్యాంక్ లు సాధించి జాతీయ స్థాయిలో సుమారు 30 మందికి పైగా ఐఐటీ, ఎనఐటీ, ఐఐఐటీ, జీఎఫ్‌టీ లాంటి ప్రముఖ కాలేజీలలో సీట్లు సాధించారని తెలిపారు. విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఉమాదేవి మాట్లాడుతూ.. కళాశాల స్థాపించిన మూడేళ్లలోనే తమ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల కృషి, నిష్ణాతులైన అధ్యాపకుల బోధన కారణంగానే తమ కళాశాలకు ఇంతటి విజయం సాధ్యమైందన్నారు. భవిష్యత్తులోను మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమ కళాశాలపై నమ్మకం ఉంచిన విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల తేజ విద్యాసంస్థల డైరెక్టర్ తేజేశ్వర్ రెడ్డి, చైర్పర్సన్ ఉమాదేవి, సీఈఓ అనిల్ కుమార్, అకాడమిక్ డైరెక్టర్లు సాయి చైతన్య, నేత్ర వాణి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు రాజశేఖర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, ప్రిన్సిపల్ పెద్ది రెడ్డి, ఫాకల్టీలు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. తమ పిల్లలు అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ విద్యాసంస్థల అధ్యాపక బృందాన్ని యాజమాన్య కృషిని కొనియాడారు.

# భారత్ టెక్స్ న్యూఢిల్లీ లో ధర్మవరంపట్టు చీరల స్టాల్స్ ను సందర్శించిన సిపిఐ జాతీయ నాయకులు నారాయణ

**సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ**



**ధర్మవరం,జూలై18.అక్షర టైమ్స్:-** న్యూఢిల్లీలోని భారత్ టెక్స్ , ధర్మవరం పట్టుచీరల స్టాల్స్ ను సిపిఐ జాతీయ నాయకులు నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ సందర్శించారు. వారు మాట్లాడుతూ న్యూ ఢిల్లీ లోని భారత్ మంటపం నందు ఈ నెల 12 - 19 వరకు జరుగుతున్న అంతర్జాతీయ వస్త్ర వినియోగదారుల సమ్మేళనంలో ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం కు చెందిన చేనేత కళాకారుడు చిప్పల మార్కండేయులు ఆంధ్రప్రదేశ్ తరుపున పాల్గొన్నారు అని తెలిపారు. చిప్పల మార్కండేయులు ప్రదర్శన అందరిని ఆ కట్టుకోవడం పట్ల వారు అభినందించారు. దేశ విదేశాల నుంచి వచ్చిన వారికి ధర్మవరం పట్టు చీరలు, పట్టు పావడలకు మంచి ఆదరణ స్పందన వచ్చిందనితెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత శాఖ మంత్రి వర్యులు సవితమ్మ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. రాష్ట్ర హస్త కళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ , డెవలప్మెంట్ కమిషనర్ బినా , రాష్ట్ర చేనేత కమిషనర్ రేఖరాణి , టీటీడీబోర్డు సభ్యులు సుచిత్ర యెల్ల సినీ ప్రముఖులు, విశిష్టాథితులు ప్రజలు పాల్గొన్నారు.ం

# మడకశిరలో నేడు ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు పర్యటన

**బీఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణానికి భూమిపూజ**

**త్రాగునీటి ట్యాంకర్ల ప్రారంభం, అంగన్వాడీలకు సామగ్రి పంపిణీ**

**మడకశిర,జూలై18.అక్షర టైమ్స్:-** మడకశిర శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు శ్రీ సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎంఎస్.రాజు, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే.పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆదివారం మడకశిర నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.మధ్యాహ్నం 12 గంటల నుంచి అమరాపురం మండలంలోని వి. అగ్రహారం, గుణేహళ్లి, ఆలదపల్లి, బసవనపల్లి గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాల కోసం ఎమ్మెల్యే చొరవతో ప్రత్యేకంగా కొనుగోలు చేసిన త్రాగునీటి ట్యాంకర్లను ప్రారంభించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన ఇండక్షన్ స్టవ్‌లు, కుక్కర్లను పంపిణీ చేయనున్నారు.ఈ కార్యక్రమాలకు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు మరియు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

## ప్రభుత్వ పాఠశాల, కళాశాల శానిటేషన్ వర్కర్స్లకు కనీస వేతనం అమలు చేయాలి: సిఐటియు



**రాయదుర్గం,జూలై18.అక్షర టైమ్స్:-** ప్రభుత్వ పాఠశాల మరియు కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ కు మరియు ఆయాలకు వారు చేస్తున్న శ్రమకు తగ్గ కనీస వేతనం 26 వేల రూపాయలను అమలు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి. మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం సానిటేషన్ మరియు ఆయా, వాచ్మెన్ లతో కలిసి జూలై 31వ తేదీన కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, ఆయాలతో శ్రమదోపిడి చేయించుకుంటూ వారికి చాలీచాలని వేతనాలను ఇవ్వడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తున్నదని తెలిపారు. శానిటేషన్ వర్కర్లకు, ఆయాలకు, స్కూల్ వాచ్మెన్ లకు పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, వీరికి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన విధంగా వీరికి కూడా యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కావున పై డిమాండ్ల సాధన కోసం జూలై 31వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో శానిటేషన్ వర్కర్స్, ఆయాలు, స్కూల్ వాచ్మెన్ లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల, కళాశాల శానిటేషన్ వర్కర్స్ ( స్కూల్ ఆయా) యూనియన్ నాయకులు శంకర్ నోమన్ నాగమ్మ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## బోరు వేసి వార్డు ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించిన కాలవ




**రాయదుర్గం,జూలై18.అక్షర టైమ్స్:-** రాయదుర్గం పట్టణంలో 28వ వార్డు తాసిల్దార్ రోడ్డు పీర్ల మసీదు వద్ద పరిసర ప్రాంతంలో నీటి సౌకర్యము లేక ఇబ్బందిగా ఉన్నందున కాలవ శ్రీనివాసులు శాసనసభ్యు డు వారికి తెలియజేసి నందున వారు మా విజ్ఞప్తిని గమనించి మున్సిపల్ అధికారులతో మాట్లాడి అక్కడ వెంటనే బోర్ వేయించి ఒక ట్యాంకర్ ను కూడా ఏర్పాటు చేయించడం జరిగింది వాటిని శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక శాసనసభ్యు డు ద్వారా ప్రారంభించడం జరిగింది శాసనసభ్యులకు అక్కడ ప్రాంత ప్రజలు నీటి సౌకర్యం కల్పించడం పట్ల వర్షం వ్యక్తపరుస్తూ సంతోషపడ్డారు రాబోవు రోజులలో మా వార్డు నందు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మా వార్డుకు అనుకూలం కలువ చేయవలసి నదిగా కూడా విజ్ఞప్తి చేయడమైనది దానిపై వారు సానుకూలంగా స్పందిస్తూ తమ వార్డుకు సహకారం అందిస్తారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి డి ఈ సురేష్ ఆర్ పి లు రూప సువర్ణ వార్డ్ కార్యదర్శి గోవర్ధన్ అధ్యక్షు డు కంబలి రాజశేఖర్ మైనార్టీ అధ్యక్షులు ఫకీర్ జావిద్ ఇంచార్జిలు సంపత్ కుమారి ప్రశాంతి తిప్పేస్వామి ఎల్లప్ప రాజశేఖర్ వెంకటేశులు పద్మశాలి డైరెక్టర్ పురుషోత్తం వార్డు ప్రజలు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



**పెద్దవడుగూరు,జులై18.అక్షర టైమ్స్:-** మండలంలోని మిడుతూరు గ్రామంలో శనివారం రైతులతో కలిసి ఎలనినో ప్రభావం పై పంటలు ఏ విధంగా ఉన్నాయో అనే విషయం తెలిసికోవడానికి శాస్త్రవేత్తలు జిల్లా వ్యవసాయ అధికారి జె డి ఏ సాలు రెడ్డి, పర్యటించారు తీవ్ర వర్షభావ పరిస్థితులు ఉన్నందున పంటలు సరైన విధంగా దిగుబడి ఇచ్చే అవకాశం ఉండక పోవడం జరిగే అవకాశం ఉందని ప్రతి రైతు తమ తమ పంటలను తప్పని సరిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మునికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు మీసేవ లో అయినా లేక కామన్ సర్వీస్ సెంటర్స్ లలో ఇన్సూరెన్స్ చేసుకోవాలని కోరారు.ఇన్సూరెన్స్ చేసుకోవడానికి జులై నెల 31 వరకు గడువు ఉందని తెలిపారు. అలాగే రైతులు మాట్లాడుతూ వర్షాలు సమయానికి రాకపోవడంతో పంట దిగుబడి పెరగలేదని, ఎల్ నినో ప్రభావం చూపుతోందని రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని తెలిపారు.

## పాఠశాల ఆవరణలో వర్షపు నీరు




**పెద్దవడుగూరు,జులై18.అక్షర టైమ్స్:-** ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం మెరుగు పరచాలని,పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఉన్నతాధికారులు నెత్తి నోరు బాదుకున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అవి కనిపించడం లేదు. వివరాల్లోకెళ్తే పెద్దవడుగూరు మండల కేంద్రంలోని లక్షుంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో వర్షపు నీరు చేరింది దీంతో పాఠశాలకు ఆ నీళ్లలోనే నడిచి వెళుతూ చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. నీటిలో దిగి తరగతి గదులకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.వర్షం పడితే వర్షపు నీరు వెళ్ళే మార్గం సరిగా లేకపోవడం కూడా మరో కారణం. ఈ పాఠశాల ప్రాంగణంలో నీరు నిలవకుండా మట్టితో నింపితే పరిష్కారం అవుతుందని విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు

## సేంద్రియ వ్యవసాయంతో వర్షాభావాన్ని అధిగమిద్దాం: మండల ప్రత్యేక అధికారి జనార్దన్ రావు



**ముదిగుబ్బ,జూలై18.అక్షర టైమ్స్:-** వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలంటే రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని మండల ప్రత్యేక అధికారి జనార్దన్ రావు సూచించారు. శనివారం ముదిగుబ్బ మండలం లోని యాకర్లకుంటపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆరుతడి పంటలు, పీఎండీఎస్ పై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి రైతు తాను సాగు చేయనున్న పంటల విత్తనాలను ముందుగానే విత్తన గుళికలు గా తయారు చేసుకుని, వర్షం కోసం వేచి ఉండకుండా వెంటనే పొలాల్లో చల్లాలని సూచించారు. స్వల్ప వర్షం కురిసిన వెంటనే విత్తనాలు ఆరోగ్యంగా మొలకెత్తి మంచి దిగుబడికి దోహదపడతాయని తెలిపారు. ప్రధాన పంటలతో పాటు ఇతర పంటల విత్తనాలను కూడా విత్తన గుళికలుగా తయారు చేసి సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. అలాగే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేయడం ఉత్తమమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి హాజీవలి సాహెబ్, వ్యవసాయ అధికారి రవీంద్ర, ప్రకృతి వ్యవసాయ విభాగం మండల కోఆర్డినేటర్ పెద్దన్న, ఎఫ్ఎమ్టీ కృష్ణవేణి, వ్యవసాయ సిబ్బంది అంజిబాబు, ప్రియాంక, నాగరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# రాయదుర్గం మద్యం షాపుల్లో అధిక వసూళ్లు వినియోగదారుల దోపిడీని అరికట్టాలి



**రాయదుర్గం,జూలై18.అక్షర టైమ్స్:-** ప్రతి గ్రామాల్లో బెల్ట్ షాపులు మద్యం దోపిడీ నీ అరికట్టేఎక్సైజ్ అధికారులు నిద్రపోతున్నారా లేక మామూళ్ల మత్తులోతూ గుతున్నారా అనిఏఐవైఎఫ్,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కావలి,కోట్రేష్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలో అధికారిక లైసెన్స్ ఉన్న మద్యం వైన్ షాపులతో పాటు అక్రమ బెల్ట్ షాపుల్లో కూడా ఎమ్మార్పీ కన్నా విచ్చలవిడిగా అదనపు వసూళ్లు జరుగుతున్నాయి. పట్టణంలో రూ. 10, 20, గ్రామాల్లో ఏకంగా రూ. 40 వరకు దోపిడీ చేస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు కళ్లు మూసుకున్నారు.ఆధారాలతో బయటపడిన దోపిడీ1,రాయదుర్గం పట్టణం 18 జూలై 2026 న మ్యాన్షన్ హౌస్ బ్రాందీ బాటిల్ ఎమ్మార్పీ రూ. 210 కాగా, షాపు వారు రూ. 220 వసూలు చేశారు. చెల్లింపు జరిగిన రసీదు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రతి బాటిల్పై రూ. 10 చొప్పున దోపిడీ చేస్తున్నారు. 2.హీరేహాల్ మండలం కొన్ని రోజుల క్రితం బాటిల్పై రూ. 20 అదనంగా వసూలు చేసినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు లేవు. 3.గ్రామాల్లో బెల్ట్ షాపులు అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపుల్లో ఏకంగా రూ. 40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.ఎక్సైజ్ శాఖ మరియు ప్రభుత్వ పూర్తిగా వైఫల్యం చెందాయని కూటమి ప్రభుత్వ హయాంలో ఒక్కో మండలానికి 30-40 మద్యం షాపులు ఇచ్చి, ఒక్కొక్కరి దగ్గర 50 వేల నుండి లక్ష రూపాయల వరకు డిపాజిట్లు, వేలం పాటల పేరుతో వసూలు చేశారు. బెల్ట్ షాపులను అరికడతామని చెప్పి, పైగా వారి నుండి డిపాజిట్లు తీసుకుని ప్రోత్సహించారు. ఆ డబ్బు తిరిగి ఇస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా ఉంది.ఇంకా దారుణం ఏమిటంటే గుమ్మగట్ట మండలంలోని కొన్ని గ్రామాల్లో స్కూళ్ల దేవాలయాలు పరిసర ప్రాంతాల్లోనే బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు.ఫోన్ పే ద్వారా రసీదులతో సహా దోపిడీ జరుగుతున్నా ఎక్స్చేంజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దాని వెనుక ఉన్న అంతర్యం ఏమిటో ప్రజలకు చెప్పాలి.

**ఏఐవైఎఫ్ ప్రధాన డిమాండ్లు:**

1.రాయదుర్గం నియోజకవర్గంలోని అన్ని వైన్ షాపులు, బెల్ట్ షాపులపై వెంటనే దాడులు నిర్వహించి ఎమ్మార్పీ కన్నా అదనంగా వసూలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

2. అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వినియోగదారులకు తిరిగి ఇప్పించాలి.

3. ప్రతి షాపులో ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ లిస్ట్ను బహిరంగంగా ప్రదర్శించాలి. ఉల్లంఘించిన వారి లైసెన్సులు రద్దు చేయాలి.

4. స్కూళ్లు, కళాశాలలు, దేవాలయాలకు 500 మీటర్ల పరిధిలో ఉన్న అన్ని మద్యం షాపులు, బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలి.

5. బెల్ట్ షాపుల నిర్వాహకుల నుండి తీసుకున్న డిపాజిట్ల లెక్కలు బహిరంగపరచి, ఆ డబ్బును ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలి.

ప్రజల రక్తాన్ని పీల్చే ఈ దోపిడీని ఆపకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తొందరలో రాయదుర్గం ఎక్సైజ్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరిస్తున్నాము. ప్రభుత్వం వెంటనే స్పందించి వినియోగదారులను ఈ దోపిడీ నుండి కాపాడలన్నారు.

# చెత్తను సంపదగా మార్చడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు




**రాయదుర్గం,జూలై18.అక్షర టైమ్స్:-** చెత్తను సంపదగా మార్చే విధానంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రాయదుర్గం పట్టణంలోని కాయగూరల మార్కెట్ దగ్గర శనివారం నిర్వహించిన "స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధితో పాటు పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందుకు తొలి ప్రధాన ఇస్తున్నారన్నారు. 1995లో పచ్చదనం పరిశుభ్రత అనే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారన్నారు. హైదరాబాద్ మహానగరంలో విరివిగా చెట్లు పెంచడం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గటంతో పాటు రెండు డిగ్రీల ఉష్ణోగ్రత కూడా తగ్గిందని వివరించారు. అలాగే రాత్రి వేళల్లో రోడ్లను శుభ్రం చేసే విదేశీ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. పచ్చదనం పెంపు, పర్యావరణ పరిశుభ్రతపై ఆయనకున్న నిబద్ధత అలాంటిది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చెత్తను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసి తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. రాయదుర్గం పట్టణంలో కూడా ఈ విధానం అమలు అవుతూ ఉందన్నారు. ఎక్కడికక్కడ పేరుకుపోయే వ్యర్థాలను సంపదగా మార్చే విధానంతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థిక ప్రయోజనాలు కూడా చేకూరుతాయన్నారు. ముఖ్యంగా చెత్త రవాణా ఖర్చులు తగ్గటంతో పాటు ప్రాసెస్ చేసిన చెత్తను వినియోగంలోకి తేవడం వల్ల సంపద సృష్టి జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబం తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి స్థానిక సంస్థలకు సహకరించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం, పచ్చదనాన్ని పెంపొందించడం ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. "స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర" లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి, చెత్తను సంపదగా మార్చే కార్యక్రమానికి సహకరించాలని ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి,పద్మశాలి డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తము మాజీ డైరెక్టర్ టశీకసాల హనుమంతు,,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల వెంకటేశులు,క్లస్టర్ ఇంఛార్జి ఇనాయత్, సెంట్రల్ స్టోర్ చైర్మన్ పూజారి శివ,బంగి శంకర్, ఆనంద్, ప్రశాంతి సంపత్ కుమారి,బుదురు తిప్పేస్వామి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో మరో ముందడుగు

### ముదిగుబ్బలో ఘనంగా అవగాహన ర్యాలీ

### మానవహారం,స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాలు




**ముదిగుబ్బ,జూలై18.అక్షర టైమ్స్:-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జూలై నెల థీమ్ "బల్క్ వ్యర్థాల ఉత్పత్తిదారుల గుర్తింపు (ఎన్యుమరేటర్స్ ఆఫ్ బల్క్ వేస్ట్ జనరేటర్స్)" పై శనివారం ముదిగుబ్బ జడ్పీహెచ్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కార్యక్రమాన్ని ప్రారంభించిన అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం జడ్పీహెచ్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో స్వచ్ఛత సందేశాలతో కూడిన ప్లకార్డులు పట్టుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రజలకు పరిశుభ్రతపై సందేశం అందించారు.ర్యాలీ అనంతరం మానవహారం ఏర్పాటు చేసి "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర" లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన స్వచ్ఛత ప్రతిజ్ఞలో పాల్గొన్న వారందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, తడి-పొడి వ్యర్థాలను వేర్వేరుగా నిర్వహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అధికారులు ఈ కార్యక్రమం గురించి మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై పాఠశాలలో నేర్చుకున్న విషయాలను తమ తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక స్వచ్ఛత రాయబారిగా మారి గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థుల ద్వారా కుటుంబాల్లో చైతన్యం పెరిగితే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని త్వరగా సాధించవచ్చని తెలిపారు.పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా పెద్ద మొత్తంలో వ్యర్థాలను ఉత్పత్తి చేసే హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి ప్రభుత్వ నిబంధనలను పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మొలకవేముల క్రాస్లో రైతుల ఆగ్రహం

### నష్టపరిహారం లేకుండానే హైటెన్షన్ టవర్ల నిర్మాణమా.?

### భూముల మార్కెట్ విలువను విస్మరించి పరిహారం నిర్ణయించారంటూ రైతుల ఆవేదన..

### న్యాయం జరిగే వరకు పనులు నిలిపివేయాలని డిమాండ్



**ముదిగుబ్బ,జూలై18.అక్షర టైమ్స్:-** సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలోని ముదిగుబ్బ మండల పరిధిలోని మొలకవేముల క్రాస్ వద్ద హైటెన్షన్ విద్యుత్ టవర్ల నిర్మాణంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కదిరి రూరల్ ముత్యాలచెరువు 220/222 కేవీ విద్యుత్ కేంద్రం నుంచి వైకొత్తపల్లి 132 కేవీ లైన్, అక్కడి నుంచి మొలకవేముల లెఫ్ట్ ఇరిగేషన్ ప్రాంతం వరకు 132 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ టవర్ల నిర్మాణ పనులు కొనసాగుతుండగా, భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించకుండా పనులు చేపడుతున్నారని ఆరోపించారు. రైతుల కథనం ప్రకారం, పంట నష్టాన్ని అంచనా వేయకుండా, భూముల అసలు మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకోకుండా పరిహారం నిర్ణయించడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎకరా భూమి మార్కెట్ విలువ సుమారు రూ.2 కోట్ల వరకు ఉన్నప్పటికీ, అధికారులు కేవలం రూ.95 వేల విలువగా లెక్కించి పరిహారం నిర్ణయించారని ఆరోపించారు. హైటెన్షన్ విద్యుత్ లైన్లు తమ వ్యవసాయ భూముల మీదుగా వెళ్లడం వల్ల భూముల విలువ తగ్గిపోవడంతో పాటు భవిష్యత్తులో సాగుకు కూడా ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. తరతరాలుగా సాగుచేస్తున్న భూములను కోల్పోయి జీవనాధారం దెబ్బతింటోందని, తగిన నష్టపరిహారం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, "మా భూములను తీసుకుని, మా జీవనాధారాన్ని నాశనం చేసి, తగిన నష్టపరిహారం కూడా ఇవ్వకుండా మమ్మల్ని రోడ్డున పడేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మహత్యలే మాకు శరణ్యమనే స్థితికి నెట్టివేస్తున్నారు" అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

**రైతుల ప్రధాన డిమాండ్లు**

భూముల మార్కెట్ విలువ ఆధారంగా న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలి. పంట నష్టానికి ప్రత్యేక పరిహారం వెంటనే ఇవ్వాలి. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని టవర్ల నిర్మాణంపై పునఃసమీక్ష చేయాలి. న్యాయం జరిగే వరకు నిర్మాణ పనులను నిలిపివేయాలి. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. లేకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా మున్సిపల్ హైస్కూల్లో పరిశుభ్రత కార్యక్రమం



**కదిరి,జూలై18.అక్షర టైమ్స్:-** స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిజాంవలి కాలనీలోని మున్సిపల్ హైస్కూల్లో శనివారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల భవనాలపై పేరుకుపోయిన చెత్తను తెదేపా రాష్ట్ర తెలుగుమహిళా కార్యదర్శి సీట్ల రవణమ్మ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బందితో కలిసి తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సీట్ల రవణమ్మ మాట్లాడుతూ, "పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత. మన ఇల్లు, పాఠశాల, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చు" అని అన్నారు. విద్యార్థులు, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొని పరిశుభ్రతకు తమ వంతు సహకారం అందించారు.

అక్షర టైమ్స్

# జాతీయ వేదికపై కదిరి ప్రతిభకు మరో గుర్తింపు

### నేషనల్ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో రాణించిన బ్లూమూన్ పూర్వ విద్యార్థి పునీత్ రాయల్

**కదిరి,జూలై18.అక్షర టైమ్స్:–** మారుమూల ప్రాంతమైన కదిరి నుంచి జాతీయ క్రీడా వేదికపై మరో యువ క్రీడాకారుడు తన ప్రతిభను చాటుకుని అందరి ప్రశంసలు అందుకున్నాడు. పంజాబ్ రాష్ట్రంలోని తల్వారా నగరంలో గోల్ షాట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ పంజాబ్ ఆధ్వర్యంలో జూలై 10 నుంచి 12 వరకు నిర్వహించిన నాలుగో జాతీయ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బ్లూమూన్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థి పునీత్ రాయల్ ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందాడు. ఈ సందర్భంగా బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత ఎం. శివశంకర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడల్లోనూ అత్యుత్తమ శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దడం తమ విద్యాసంస్థ లక్ష్యమని తెలిపారు. పునీత్ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జి. రామాంజుల రెడ్డి మాట్లాడుతూ, క్రమశిక్షణ, నిరంతర సాధన, సరైన శిక్షణ ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో సత్తా చాటగలరని పునీత్ మరోసారి నిరూపించాడన్నారు. భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ వేదికలకు పంపించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పునీత్ రాయల్‌ను పాఠశాలలో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. సురేంద్ర రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి సి. మాధవరెడ్డి, పీఈటీ డ్యానియల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని పునీత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. "కదిరి నుంచి జాతీయ క్రీడా వేదిక వరకు..." పునీత్ రాయల్ సాధించిన ఈ విజయం స్థానిక క్రీడాకారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు




బ్లూమూన్ విద్యాసంస్థలకు మరో గర్వకారణంగా నిలిచింది.

# రైతులకు పంటల బీమా ప్రీమియం గడువు పొడిగింపు

### గడువులోగా నమోదు చేసుకోవాలని రైతులకు సూచన



**గుడిబండ,జూలై18.అక్షర టైమ్స్:–** గుడిబండ మండల రైతులకు ప్రభుత్వం ఊరట కల్పించింది.పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువును ప్రభుత్వం పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి వీర నరేష్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు.వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద వేరుశెనగ పంటకు ఎకరాకు రూ. 640, పత్తి పంటకు ఎకరాకు రూ. 1,900 ప్రీమియం నిర్ణయించారు. ఈ రెండు పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు జూలై 24 వరకు గడువు ఉందని తెలిపారు.ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద కంది పంటకు ఎకరాకు రూ. 102, మొక్కజొన్నకు రూ. 165, రాగికి రూ. 100, ఆముదానికి రూ. 100 ప్రీమియం నిర్ణయించారు. ఈ పంటలకు బీమా నమోదు చేసుకునేందుకు జూలై 31 వరకు అవకాశం కల్పించారు.రైతులు సమీపంలోని మీ సేవ కేంద్రాలు, ప్రజా సేవా కేంద్రాలు, పంట రుణం తీసుకున్న బ్యాంకులు లేదా ఆన్‌లైన్ ద్వారా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి వీర నరేష్ తెలిపారు. గడువు చివరి వరకు వేచి ఉండకుండా ముందుగానే పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.

# శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు ఏఐఎస్బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వి



**అనంతపురం,జులై18.అక్షర టైమ్స్:** నిర్మాణంలో ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వి డిమాండ్ చేశారు. శనివారం అనంతపురం అర్బన్ నియోజకవర్గం కార్యాలయంలో ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో భాగంగా పాపిరెడ్డిపల్లి పృథ్వి.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాపిరెడ్డిపల్లి పృథ్వి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఇష్టారాజ్యంగా విద్యాసంస్థలు నిర్వహిస్తున్న శ్రీచైతన్యపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో శ్రీచైతన్య విద్యాసంస్థలు 8 బ్రాంచులున్నాయని, ఏ ఒక్క పాఠశాలలో కూడా ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకంటే అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా నగరంలో ఉన్న పిస్తా హౌస్ హోటల్ సమీపంలో శ్రీ చైతన్య పాఠశాల భవనం నిర్మాణంలో ఉందని, ఆ భవనంలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పేర్కొన్నారు. భవనం నిర్మాణంలో ఉన్న ఆ భవనానికి విద్యాశాఖ అధికారులు అనుమతి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న ఆ భవనంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు నయా దందా చేస్తూ రాజ్యాంగాన్ని చట్టాన్ని ఖూనీ చేస్తూ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారనిన్నారు. తక్షణమే శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్బీ నాయకులు మంజుల విష్ణు, గౌతమ్ కుమార్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా జరిగిన నియోజకవర్గ క్రీడలు





**ధర్మవరం,జులై18.అక్షర టైమ్స్:–** పట్టణంలో గవర్నమెంట్ బాయ్స్ హై స్కూల్ నందు అమరావతి ఛాంపియన్షిప్ 2026 ధర్మవరం నియోజకవర్గ స్థాయిలో నలుమూలల నుండి 400 మంది క్రీడాకారులు 12 క్రీడాంశములలో రావడం జరిగింది అని యోగ స్పోర్ట్స్ అధ్యక్షులు సోమేశ్వర్ రెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా బిజెపి ఇంచార్జ్ హరీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కిషోర్ ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ కోచులు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు అని తెలిపారు. వివిధ క్రీడాపోటీలు అందరిని ఆకట్టుకున్నాయి.ధర్మవరం నియోజకవర్గ స్థాయిలో సెలెక్ట్ అయిన 12 క్రీడాంశంలోని క్రీడాకారులు జిల్లా స్థాయి ఎంపిక చేయడం జరిగినది అని తెలిపారు.

# మోడల్ స్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహణ

### ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప



**ధర్మవరం,జులై18.అక్షర టైమ్స్:–** పట్టణంలోని తారకరామాపురం ముద్ద గల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మొత్తం 450 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా 52 మందికి కంటి అద్దములు అవసరమని వారు తెలిపారు. వీరికి త్వరలో కంటి అద్దాలు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు కంటి సంరక్షణ పట్ల జాగ్రత్తలను తెలియజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా అసిస్టెంట్ మోహన్ గౌడ్, సిఈఓ మారుతి, ప్రిన్సిపాల్ శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి



**ధర్మవరం,జులై18.అక్షర టైమ్స్:–** పట్టణంలోని స్థానిక కె.హెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ .ఏ. ఆదినారాయణ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్, డా. కె.ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లో భాగంగా సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌లను నిర్మూలించడం, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణను అమలు చేయడం ,సుస్థిర పౌర వాతావరణాలను నెలకొల్పడం ముఖ్యఉద్దేశం. పారిశుధ్యం కేవలం కార్మికుల బాధ్యత మాత్రమే కాదు, పౌరుల రోజువారీ బాధ్యతగా, ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడాలని, అది మనల్ని ఆరోగ్యవంతులుగా చేస్తుందని తెలిపారు. యువత బాధ్యతాయుతంగా వుండాలని తెలిపారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాలలో తరగతి గదులు, ప్రయోగశాలలు, కారిడార్లు, ఊడ్చి చక్కగా శుభ్రపరచి కళాశాల ఆవరణంలోని చెత్తను తొలగించి స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆదినారాయణ,యస్. పర్వీన్ ఎస్. పావని, డా.హెచ్. శివ శంకర్, డా. హరి ప్రసాద్, సి. వనిత, టి.సునీత కే. సుప్రియ,బి. హారతి,బి.ఆనంద్, జి.మీనాజి. ధనుంజయ,, ఎస్ ఒబులపతి, , గంగా...తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

# ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం కోఆర్డినేటర్ వై.నరేంద్రబాబు




**ధర్మవరం,జులై18.అక్షర టైమ్స్:–** పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి అని కోఆర్డినేటర్ వై. నరేంద్రబాబు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ చదువు మధ్యలో ఆగిపోయిన వారికి, మళ్లీ మీ భవిష్యత్తుకు శ్రీకారం ఓపెన్ స్కూల్ అవుతుందని తెలిపారు. పదవ తరగతి ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇదొక ప్రత్యేకమైన అవకాశం అని తెలిపారు. మధ్యలో చదువు మానేసిన వారికి ఇది ఒక సువర్ణ అవకాశమని, ఉద్యోగం చేస్తూనే చదువు కొనసాగించే అవకాశం అని వారు తెలిపారు. చదువు ఎప్పటికీ ఆగదు అని మీ విజయానికి ఇదే సరైన అవకాశం అని తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరమునకు అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అర్హతలు తేదీలు వంటి వివరాలను సంబంధిత అధికారిక నోటిఫికేషన్ ప్రకారం నిర్ధారించుకొని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9154763160 కు గాని 9290757352 గాని సంప్రదించాలని తెలిపారు.

# జులై నెల 30-31 తేదీలలో కలెక్టరేట్ల ధర్నాను జయప్రదం చేద్దాం

### జిల్లా అధ్యక్షులు అయుబుకాన్



**ధర్మవరం,జులై18.అక్షర టైమ్స్:–** సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మినిమం టైం స్కేల్ అమలు, రేగులరైజేషన్ సమస్యలపై జూలై 30, 31 వ తేదీలలో కలెక్టరేట్ల వద్ద ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అయుప్కాన్, పెద్దన్న, ఎస్ హెచ్ భాష, ఆదినారాయణ, జేవి రమణ తెలిపారు. వారు స్థానిక సిఐటియు కార్యాలయం నందు సిఐటియుమండల స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూఎన్నికలకు ముందు కూటమిప్రభుత్వం అన్ని రంగాల కార్మికులకు, స్కీం వర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని,ఔట్ సోర్సింగ్ లో పని చేస్తున్న కార్మికులందరికీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు. హైకోర్టు తీర్పుల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.అధికారులు పనిచేయించుకోవడమే కానీ సమస్యలు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున కార్మికుల సమస్యల పరిష్కారంతోపాటు తదితర డిమాండ్ల సాధనకై ఈనెల 30, 31న, జరిగే కలెక్టరేట్ల ధర్నాలలో కార్మికులందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిస్తూ కరపత్రాలను విడుదల చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మండల సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, విజయ, దినా, సరస్వతి, చంద్రకళ, ట్రాన్స్పోర్ట్ రంగం నాయకులు ఎస్,రఫీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మేకల బాబు, ముకుంద, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు ఖాదర్ భాష, సివిల్ సప్లై యూనియన్ అధ్యక్షుడు దాసరి బాలు, మున్సిపల్ స్కూల్ ఆయాల సంఘం నాయకులు చౌడమ్మ, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# తాడిపత్రి రూరల్ పరిధిలో 10 మంది బైండోవర్




**తాడిపత్రి,జూలై18.అక్షర టైమ్స్:–** రూరల్ పరిధిలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వేర్వేరు ఘటనలకు సంబంధించి 10 మందిని తాడిపత్రి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు రూరల్ అప్ గ్రేడ్ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు సంబంధిత వ్యక్తుల నుంచి ఒక సంవత్సరం కాలపరిమితికి రూ.2 లక్షల విలువైన వ్యక్తిగత పూచీకత్తు తీసుకున్నట్లు పేర్కొన్నారు. బైండోవర్ కాలంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడినా, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొన్నా .. బాండ్ నిబంధనలను ఉల్లంఘించినా పూచీకత్తు జప్తు చేస్తామన్నారు.అంతేకాకుండా సంబంధిత చట్టాల ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు భంగం కలిగించే వ్యక్తులపై నివారణాత్మక చర్యలు నిరంతరం కొనసాగుతాయని సీఐ నారాయణ హెచ్చరికలతో కూడిన సూచనలు చేశారు.

# పరిటాల శ్రీరామ్ జోక్యంతో రైతులకు ఊరట

### 72 గంటల్లో పరిహార చెక్కులు పంపిణీకి అధికారుల హామీ

### మొలకవేముల క్రాస్‌లో 132 కేవీ హైటెన్షన్ టవర్ వివాదం సద్దుమణిగింది..

### రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని పరిటాల శ్రీరామ్ హామీ



**ముదిగుబ్బ,జూలై18.అక్షర టైమ్స్:** శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం మొలకవేముల క్రాస్‌లో 132 కేవీ హైటెన్షన్ విద్యుత్ టవర్ నిర్మాణ పనుల సందర్భంగా రైతులు చేపట్టిన ఆందోళనకు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ జోక్యంతో తాత్కాలిక పరిష్కారం లభించింది. 2022 భూముల విలువ ఆధారంగా పరిహారం నిర్ణయించి, 2026లో పనులు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పరిటాల శ్రీరామ్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.రైతుల పట్ల అధికారులు, పోలీసులు దురుసుగా వ్యవహరించారని వచ్చిన ఆరోపణలపై ఆయన అసహనం వ్యక్తం చేస్తూ, రైతులకు న్యాయం జరిగేలా అధికారులతో చర్చలు జరిపారు.అనంతరం రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులతో జరిగిన చర్చల్లో 72 గంటల్లోపు రైతులకు పరిహార చెక్కులు పంపిణీ చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, "రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు వారి పక్షాన అండగా నిలబడి పోరాడుతాం" అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఉమామహేశ్వర్ రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సునీత, ముదిగుబ్బ మండల కన్వీనర్ తుమ్మల మనోహర్, నరసింహా యాదవ్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు కార్తీక్ నాయుడు, మల్లికార్జున, రమేష్ బాబు, కోట్ల బాబ్జి, గుత్తా సురేందర్ నాయుడు, గుత్తా సూర్యనారాయణతో పాటు రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### జూలై 30న 'ఛలో కలెక్టరేట్'ను జయప్రదం చేయండి: సీఐటీయూ పిలుపు



**కదిరి,జూలై18.అక్షర టైమ్స్:–** మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 30వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే 'ఛలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం కదిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులు ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు అనుగుణంగా 'సమాన పనికి సమాన వేతనం' అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రధాన డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జూలై 30న జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే ధర్నాలో మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు జనార్ధన్, కార్యదర్శి తిరుపాల్, కోశాధికారి బాలకృష్ణ, సీఐటీయూ పట్టణ కార్యదర్శి బాబ్జాన్, ముస్తాక్‌తో పాటు యూనియన్ నాయకులు ఎం. సూరి, కే. చెన్నకృష్ణ, ఎస్. లక్ష్మన్న, సి. రేవతి, ఎం. రామాంజులమ్మ, కే. శ్రీనివాసులు, వి. రమణ, కే. కృష్ణ, కుమార్, ఎం. రాజేష్, ఎస్. రాజు, పి. నరసింహమూర్తి, పర్మినెంట్ కార్మికుల నాయకులు ఆంజనేయులు, జి. మనోహర్, పి. నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# షరతులు తొలగించి 'తల్లికి వందనం' అందరికీ అమలు చేయాలి: ఏఐఎస్ఎఫ్




**కదిరి,జూలై18.అక్షర టైమ్స్:–** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకాన్ని అనవసరమైన షరతులు లేకుండా అర్హులైన ప్రతి విద్యార్థికి వర్తింపజేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువులకు దూరం కాకుండా చేయడమే ఈ పథకం లక్ష్యమని, ఆధార్, బ్యాంకు లింక్, సాంకేతిక సమస్యల కారణంగా లబ్ధి కోల్పోయిన విద్యార్థులకు వెంటనే అవకాశం కల్పించాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిద్ధార్థ, విఘ్నేష్, అనిల్, గురు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

### జూలై 30, 31 తేదీల ధర్నాను జయప్రదం చేయాలి: సీఐటీయూ నాయకులు



**గుడిబండ,జూలై18.అక్షర టైమ్స్:–** గుడిబండ మండల సమన్వయ కమిటీ సమావేశం అంగన్వాడీ నాయకురాలు మహాదేవమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీం వర్కర్లు, ఇతర రంగాల కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 30, 31 తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాలో గుడిబండ మండలంలోని కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. సౌభాగ్య, పీహెచ్‌సీ నాయకులు యశోద, అంజమ్మ, జ్ఞానమ్మ, అంగన్వాడీ నాయకులు మహాదేవమ్మ, లక్ష్మీదేవి, నగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# షైనింగ్ స్టార్ అవార్డ్స్-2026 10వ తరగతి, ఇంటర్ టాపర్స్‌కు రూ.20,000 నగదు బహుమతి

**బుక్కరాయసముద్రం,జులై18.అక్షర టైమ్స్:** మార్చి-2026 లో నిర్వహించిన 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షైనింగ్ స్టార్ అవార్డ్స్-2026 కార్యక్రమం నిర్వహిశీచిన జిల్లా విద్యాశాఖాధికారి.

**అవార్డుల ప్రదానోత్సవ వివరాలు**

తేదీ 20-07-2026, రేపు

సమయం: ఉదయం 8:00 గంటలు

వేదిక: ఎన్టీఆర్ ఆడిటోరియం, జేఎన్టీయూ అనంతపురం

అనంతపురం జిల్లా కలెక్టర్

సమన్వయం జిల్లా విద్యాశాఖాధికారి తదితరులు పాల్గొని

**బహుమతులు:**

ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.20,000/- నగదు ప్రోత్సాహకం, ప్రశంసా పత్రం మరియు మెడల్ అందజేయనున్నారు.

గమనిక: ఎంపికైన ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి నిర్ణీత సమయానికి కార్యక్రమానికి హాజరు కావాలని డీఈవో కోరారు.

సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డిఇవో కార్యాలయం అధికారిక పత్రికా ప్రకటన

తేదీ: 18-07-2026 । ప్రదేశం: అనంతపురం "షైనింగ్ స్టార్ అవార్డ్స్-2026"10వ తరగతి, ఇంటర్ టాపర్స్‌కు రూ.20,000 నగదు బహుమతి అనంతపురం: మార్చి-2026 లో నిర్వహించిన 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "షైనింగ్ స్టార్ అవార్డ్స్-2026" కార్యక్రమం నిర్వహించనుంది.

**జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం:**

అవార్డుల ప్రదానోత్సవ వివరాలు:

తేదీ: 20-07-2026, సోమవారం

సమయం: ఉదయం 8:00 గంటలు

వేదిక: ఎన్టీఆర్ ఆడిటోరియం, జెఎన్టీయూ అనంతపురం

అధ్యక్షత: అనంతపురం జిల్లా కలెక్టర్

సమన్వయం: జిల్లా విద్యాశాఖాధికారి

**బహుమతులు:**

ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.20,000/- నగదు ప్రోత్సాహకం,ప్రశంసా పత్రం మరియు మెడల్ అందజేయనున్నారు.

గమనిక: ఎంపికైన ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి నిర్ణీత సమయానికి కార్యక్రమానికి హాజరు కావాలని డి ఈఓ కోరారు.సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు/యాజమాన్యాలు ఎంపికైన విద్యార్థులను సకాలంలో కార్యక్రమానికి పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.శ్రీనివాసరావు తెలియజేశారు.

# స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమం

### శుభ్రత పరిశుభ్రతపై అవగాహన







**పామిడి,జూలై18.అక్షర టైమ్స్:-** మండల కేంద్రమైన పామిడి పట్టణంలో ప్రతి 3వ. శనివారం నిర్వహించే స్వచ్ఛంద స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నూతన ఎంపీడీవో డి.ప్రభాకర్, డిప్యూటీ ఎంపీడీవో ఆస్వర్ధనాయుడు, ఈఓ శివమూర్తిల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం నుంచి సిబ్బందితో శుభ్రత పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బీసీసీ రోడ్, ఎద్దులపల్లి రోడ్, అంబేద్కర్ సర్కిల్ నందు గల రోడ్లను పరిశుభ్రత చేశారు. చెత్తను పారవేయొద్దు పరిశుభ్రతను చేయచేయకు, ప్లాస్టిక్ కవర్లు వద్దు,నూలు సంచులు ముద్దు, మొక్కలను నాటుదాం చెట్లను పెంచుదాం పర్యావరణాన్ని పెంపొందించుదాం అంటూ నినాదాలతో ఆప్రాంతాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్లోని కాయకూరల షాపులలో ప్లాస్టిక్ కవర్లు ఉన్నాయేమోనని తనిఖీ చేశారు. వినియోగదారునికి కాయకూరలు ప్లాస్టిక్ కవర్లో అందజేస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి ప్రభాకర్, డిప్యూటీ ఎంపీడీవో అస్వర్తనాయుడు, ఈవో శివమూర్తి, టిడిపి సీనియర్ నాయకుడు,ఎడిసిసి బ్యాంక్ మండల చైర్మన్ బొల్లు శ్రీనివాసరెడ్డి,కార్యదర్శి నాగరాజు, ఏవో లు హరినాథ్, ఖాజా మహమ్మద్, సచివాలయల సిబ్బంది, పంచాయతీ వర్కర్లు, అంగనవాడి వర్కర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## గుంతకల్ పురపాలక సంఘం 31 వ వార్డును ఏరియాను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి



**గుంతకల్,జూలై18.అక్షర టైమ్స్:- (ప్రతినిధి గుమ్మనూరు హరి) :** గుంతకల్ పట్టణం నందు గల 31వ వార్డు నందు మస్తాన్ పేట ఏరియా లో గల శానిటేషన్ చేసి అక్కడ వార్డులు ఏరియా నందు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు అలాగే సీనియర్ ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ పరిశీలించి పరిశుభ్రత గురించి వివరించి ప్రజలకు అవసరమైన పోషక ఆహారాలు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని చెప్పారు ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది మరియు అన్న క్యాంటీన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కసాపురం పుణ్యక్షేత్రం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో మెగా ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన ఏవో



**గుంతకల్,జూలై18.అక్షర టైమ్స్:- (ప్రతినిధి గుమ్మనూరు హరి) :** గుంతకల్ పట్టణం కసాపురం గ్రామం పుణ్యక్షేత్రం కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో నందుగల మెగా వైద్య శిబిరం ప్రారంభించిన ఆలయం ఏవో మేడిపల్లి విజయరాజు శనివారం కావడంతో గ్రామ ప్రజలు మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు అలాగే నిపుణులైన వైద్యుల చేత ఉచిత పరీక్షలు నిర్వహించి అలాగే అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేసిన కసాపురం ఆలయం ఏవో మేడేపల్లి విజయరాజు ఈ కార్యక్రమంలో కసాపురం ఆలయం సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లో ఉన్న మాజీ ఎమ్మెల్యే వెంకట రామిరెడ్డి కలిసిన వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు



**గుంతకల్,జూలై18.అక్షర టైమ్స్:-(ప్రతినిధి గుమ్మనూరు హరి) :** గుంతకల్ పట్టణం నందు గల వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు వైసిపి మాజీ ఎమ్మెల్యే వెంకట రామిరెడ్డి హైదరాబాదులో ఆయన నివాసంలో కలిసిన తన పార్టీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే వై వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ నా పార్టీ కార్యకర్తల ను అభిమానులు కలవడం చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు అలాగే గుంతకల్ నియోజకవర్గం ప్రజలు అందరూ బాగున్నారా అని తెలుసుకున్నారు అలాగే తన అభిమానులు మాట్లాడుతూ ఆ దేవుని దయతో మీ ఆశీస్సులతో బాగున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్సీ సెల్ పట్టణ ఉపాధ్యక్షులు మోపూరి రాజశేఖర్, మరియు డీజే ఆంటోనీ, మైనార్టీ నాయకుడు చాంద్ బాషా కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# రాప్తాడు వ్యవసాయ మార్కెట్ కు భూమి కేటాయింపు

### ఎమ్మెల్యే పరిటాల సునీతకు కృతజ్ఞతలు తెలిపిన కమిటీ సభ్యులు

### పండమేరు ఆలయానికి సంబంధించిన 15ఎకరాలు లీజుకు అనుమతి

### రాప్తాడు నియోజకవర్గానికి నెరవేరనున్న మార్కెట్ యార్డ్ కల



**అనంతపురం,జులై18.అక్షర టైమ్స్:-** రాప్తాడు వ్యవసాయ మార్కెట్ యార్డుకు భూమి కేటాయింపు అనుమతులు రావడంపై మార్కెట్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీతకు కమిటీ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాప్తాడుకు గత కొన్నేళ్లుగా మార్కెట్ యార్డు కమిటీ ఉన్నప్పటికీ నియోజకవర్గంలో ఎక్కడా యార్డు లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సునీత గతంలోనే స్పష్టమైన హామీ ఇచ్చారు. మార్కెట్ యార్డ్ నిర్మాణం చేపడుతామని.. ఇందుకు స్థలం కూడా కేటాయించేలా చూస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం శ్రీ పండమేరు వెంకటరమణ స్వామి దేవస్థానానికి చెందిన భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించాలని దేవాదాయశాఖకు పలు సార్లు విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలు పరిశీలించిన తర్వాత దేవాదాయశాఖ అమోదముద్ర వేసింది. సర్వే నెం. 476-3లోని భూమిలో 15 ఎకరాలను రాప్తాడు వ్యవసాయ మార్కెట్ కమిటీకి 11సంవత్సరాల లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాప్తాడు మార్కెట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ఇతర సభ్యులు, మార్కెట్ కమిటీ అధికారులు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో మార్కెట్ యార్డు ఉండాలని ఎప్పటి నుంచి ప్రయత్నాలు చేస్తున్నామని.. ఇన్ని రోజులకు ఈ కల సాకారం అవుతోందని ఎమ్మెల్యే సునీత అన్నారు. నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వారికి అన్నివిధాలుగా ఉపయోగపడే విధంగా మార్కెట్ యార్డు ఉంటుందన్నారు. ఈ భూమి జాతీయ రహదారి-44కు ఆనుకుని ఉండటంతో రైతులు మరియు వ్యాపారుల సంక్షేమం కోసం గొర్రెలు, మేకల సంత నిర్వహణకు అనుకూలంగా ఉంటుందన్నారు. కమిటీ సభ్యులు ఈ విషయంలో ప్రత్యేకంగా చొరవ తీసుకుని రైతులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. మరోవైపు మార్కెట్ యార్డ్ చైర్మన్, అధికారులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీత చొరవ వలనే ఇది సాధ్యమైందన్నారు. లీజు నిబంధనల ప్రకారం 15ఎకరాల భూమిని 11సంవత్సరాల పాటు ప్రతి ఎకరానికి సంవత్సరానికి 50వేలు అద్దె చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు అద్దెపై 30 శాతం పెంపు ఉంటుందని.. మిగిలిన భూమిని దేవస్థానం భవిష్యత్ అవసరాల కోసం కేటాయించారని వివరించారు.

# నాణ్యమైన విద్య మాత్రమే కాదు పాఠశాలల పరిశుభ్రత కూడా చాలా ముఖ్యం







### విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యం కూడా అదే

### స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్

### 10మందికి రూ.4.17 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన శ్రీరామ్

### టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం

**ధర్మవరం,జులై18.అక్షర టైమ్స్:-** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు పాఠశాలల పరిశుభ్రత కూడా ముఖ్యమని.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యం కూడా అదేనని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ధర్మవరం పట్టణంలోని రైల్వే బాలుర పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీరామ్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో కలిసి అక్కడ మొక్కలు నాటారు. పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి విద్యార్థి బాధ్యత అన్నారు. ఇక్కడ తడి, పొడి చెత్తను వేరువేరుగా చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. దానిని పాఠశాల ఆవరణంలో ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల అపరిశుభ్ర వాతావరణం ఉండటమే కాకుండా పిల్లల ఆరోగ్యం పై కూడా ప్రభావం చూపుతాయని అన్నారు. మిగిలిపోయిన ఆహారాన్ని కూడా డ్రైనేజీలో వేయకుండా ప్రత్యేకంగా ఉంచాలన్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ఒక ఆహ్లాదకరమైన వాతావరణ ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు విద్యార్థులకు అవగాహన కల్పించాలని శ్రీరామ్ సూచించారు...

**సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన శ్రీరామ్**

ధర్మవరం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ధర్మవరం, బత్తలపల్లి మండలాలతో పాటు ధర్మవరం పట్టణానికి చెందిన మొత్తం 10మందికి 4 లక్షల 17 వేల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పరిటాల శ్రీరామ్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ఖర్చు చూడటం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో మౌలిక వసతులు పెంచడమే కాకుండా ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేశారన్నారు. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రిల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బంది పడితే వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు వివరించారు. ఇప్పటివరకు ధర్మవరం నియోజకవర్గంలో 421 మందికి 2 కోట్ల 70 లక్షల విలువైన చెక్కులను అందజేశారన్నారు. ఇంత పెద్ద ఎత్తున సహాయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధర్మవరం నియోజకవర్గ ప్రజల తరపున శ్రీరామ్ కృతజ్ఞతలు తెలియజేశారు...

**ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం.. శ్రీరామ్**

ధర్మవరం టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో ఆయన అర్జీలు స్వీకరించారు. ప్రతి ఒక్కరితో ఓపికగా మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో ప్రధానంగా విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలు రెవెన్యూ పరమైన సమస్యలు శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. కొంతమంది పింఛన్లు, రేషన్ కార్డుల కోసం అర్జీలు ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీకి ఖచ్చితమైన పరిష్కారం చూపే విధంగా చొరవ తీసుకుంటామని శ్రీరామ్ అన్నారు. త్వరలోనే కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరవుతాయని ఆయన తెలిపారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని శ్రీరామ్ సూచించారు. స్థానిక నాయకులు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా చొరవ చూపాలని సూచించారు.

# ధర్మవరంలో మౌలిక వసతుల కల్పనకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి

### మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలతో శివరాం నగర్ కాలువ నిర్మాణ పనుల పరిశీలన



**ధర్మవరం,జూలై18.అక్షర టైమ్స్:-** రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు, సూచనల మేరకు ధర్మవరం పట్టణంలోని 32వ వార్డు శివరాం నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న కాలువ నిర్మాణ పనులను ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు, శనివారం మునిసిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, పనుల వేగం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. కాలువ నిర్మాణం నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నదా అనే విషయాన్ని పరిశీలిస్తూ, పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నాణ్యతను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ ప్రతినిధులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో కాలువ నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు సకాలంలో బయటకు వెళ్లే విధంగా కాలువ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ... ధర్మవరం పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, కాలువలు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, మార్గదర్శకత్వంలో వేగంగా చర్యలు చేపడుతున్నామని, ధర్మవరం పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హరీష్ బాబు స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతతో పాటు పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి పని ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూరేలా పూర్తి చేయడమే లక్ష్యమని తెలిపారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు మెరుగైన జీవన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని హరీష్ బాబు పేర్కొన్నారు.

# ధర్మవరం పర్యటనలో మంత్రి సత్యకుమార్ యాదవ్

### ధర్మవరంలో వైభవంగా శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్ర..

### హాజరుకానున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

### కరాటే క్రీడాకారుల సన్మానం మరియు చిల్డ్రన్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి

### ఆధ్యాత్మిక, రాజకీయ, క్రీడా,ఆరోగ్య కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం,జూలై18.అక్షర టైమ్స్:-** రాష్ట్ర వైద్య, ఆరోగ్య,కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు,ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ జూలై 20, 21 మరియు 22 తేదీల్లో ధర్మవరం నియోజకవర్గంలో విస్తృత పర్యటన నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.ఈ పర్యటనలో భాగంగా ఆధ్యాత్మిక, రాజకీయ, క్రీడా ప్రోత్సాహక మరియు ఆరోగ్య సంబంధిత పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నట్లు పేర్కొంది. జూలై 20 (సోమవారం) మధ్యాహ్నం 3:00 గంటలకు ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ నుండి అత్యంత వైభవంగా ప్రారంభం కానున్న శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారు. భక్తులతో కలిసి రథయాత్రలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందనున్నారు. ఈ మహోత్సవం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించబడనున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. అనంతరం సాయంత్రం 5:00 గంటలకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ప్రజలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలకు మంత్రి అందుబాటులో ఉంటారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించింది. జూలై 21 (మంగళవారం) ఉదయం 10:00 గంటలకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య బీజేపీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొంటారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరియు నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై నాయకులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేయనున్నట్లు మంత్రి కార్యాలయం పేర్కొంది. అనంతరం మధ్యాహ్నం 3:00 గంటలకు కరాటేలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన ధర్మవరం కరాటే క్రీడాకారులకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారు.క్రీడాకారులను అభినందించి, యువత క్రీడల్లో మరింత రాణించేలా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.జూలై 22 (బుధవారం) ఉదయం 10:00 గంటలకు ధర్మవరం పట్టణంలోని బీఎస్సార్ స్కూల్‌లో నిర్వహిస్తున్న చిల్డ్రన్ ఐ స్క్రీనింగ్ టెస్ట్ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. చిన్నారుల్లో కంటి సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స అందించేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలను సమీక్షించనున్నట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ మూడు రోజుల పర్యటనలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రజా సేవ, పార్టీ బలోపేతం, క్రీడా ప్రోత్సాహం మరియు ఆరోగ్య సేవల విస్తరణకు సంబంధించిన కార్యక్రమాల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొని, ప్రజల సంక్షేమం మరియు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి కార్యాలయం పేర్కొంది.

# ఏక పాదం పల్లి లో పొలంలో విద్యుత్ షాక్‌తో రైతు మృతి



**తాడిమర్రి,జూలై18.అక్షర టైమ్స్:-** బోరు మోటారు మరమ్మతులు చేస్తుండగా విషాదం -- కుటుంబంలో తీవ్ర విషాదం తాడిమర్రి, జూలై 18: తాడిమర్రి మండలంలోని ఏకమాదం పల్లి గ్రామానికి చెందిన రైతు కూచి ఆది నర్సింహులు (45) విద్యుత్ షాక్‌కు గురై దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం, తన పొలంలో ఉన్న బోరు బావిలోని మోటారు పైపులకు మరమ్మతులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగలడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగించేవాడు. ఆయనకు భార్య మునిలత, ఇద్దరు కుమార్తెలు నిత్య భార్గవి, రాజస్వి ఉన్నారు. స్వగ్రామం ఏకమాదం పల్లి కాగా, ప్రస్తుతం కుటుంబం ధర్మవరం కొత్తపేటలో నివాసం ఉంటోంది. ఆది నర్సింహులు ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన పట్ల గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని తగిన ఆర్థిక సాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

# స్టాక్ మార్కెట్లపై మళ్లీ యుద్ధం దెబ్బ.. భారీగా నష్టపోతున్న సూచీలు




స్టాక్ మార్కెట్ల పై మళ్లీ యుద్ధం దెబ్బ పడింది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ దేశాల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడం దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపింది. చర్చలు విఫలం కావడంవల్ల అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 101 డాలర్‌లు దాటింది. దాంతో మార్కెట్‌లపై బేర్ పట్టుబిగించింది. అదేవిధంగా ఇరాన్ పోర్టులను, ఆ పోర్టులకు వచ్చిపోయే నౌకలకు తమ బలగాలు దిగ్బంధిస్తాయని ట్రంప్ హెచ్చరించడం కూడా స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపింది. అదేవిధంగా ఇరాన్‌పై మళ్లీ దాడులకు ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నదన్న వార్తలు కూడా స్టాక్ మార్కెట్లను నష్టాల్లో ముంచాయి. దాంతో ఇవాళ్టి ట్రేడింగ్‌లో 76,134 పాయింట్ల వద్ద ప్రారంభమైన బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్.. ఏకంగా 1,415 పాయింట్లు కోల్పోయింది. అదేవిధంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ సైతం 479 పాయింట్లు కోల్పోయి 23,571 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది.

# 8వ వేతన సంఘం నుంచి ఉద్యోగ ప్రకటన! 12 రోజుల పనికి రూ.90 వేలు




8వ వేతన సంఘం పరిశోధన బృందంలో పనిచేయాలనుకుంటున్నారా? సీనియర్ కన్సల్టెంట్, కన్సల్టెంట్, యంగ్ ప్రొఫెషనల్ పోస్టులకు రూ.1.8 లక్షల వరకు జీతంతో ఖాళీలు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు సిఫార్సులు చేసే ఈ బృందంలో ఫుల్ టైమ్, పార్ట్‌టైమ్ అవకాశాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలపై చర్చలు జరుగుతున్న వేళ 8వ వేతన సంఘం నుంచి ఒక ఆసక్తికర ప్రకటన వెలువడింది. జీతాల పెంపు ఎప్పుడు అమలు అవుతుందనే ప్రశ్నల మధ్య, ఈ కమిషన్‌లో పనిచేయాలనుకునే వారికి కన్సల్టెంట్ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు ప్రకటించబడటం గమనార్హం. ఈ నియామకాలు ప్రధానంగా పరిశోధన, విశ్లేషణ పనుల కోసం ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, భత్యాలు, పెన్షన్‌లపై సిఫార్సులు రూపొందించడంలో ఈ బృందం కీలక పాత్ర పోషిస్తుంది. ఎంపికైన అభ్యర్థులు సాధారణ కార్యాలయ పనుల కంటే డేటా విశ్లేషణ, విధాన పరిశోధనలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఈ నియామక ప్రక్రియలో భాగంగా సీనియర్ కన్సల్టెంట్, కన్సల్టెంట్, యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు అందుబాటులో ఉన్నాయి. సీనియర్ కన్సల్టెంట్ పోస్టుకు 10 సంవత్సరాలకుపైగా అనుభవం అవసరం కాగా, వయోపరిమితి 45 సంవత్సరాలు. కన్సల్టెంట్ పోస్టుకు కనీసం 6 సంవత్సరాల అనుభవం, 40 సంవత్సరాల లోపు వయస్సు అవసరం. యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు 4 సంవత్సరాల అనుభవం, 32 సంవత్సరాల వయోపరిమితి ఉంటుంది. జీతాల విషయానికి వస్తే ఈ అవకాశాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. సీనియర్ కన్సల్టెంట్‌కు పూర్తికాలపు ఉద్యోగంలో నెలకు రూ.1.80 లక్షల వరకు వేతనం లభిస్తుంది. పార్ట్‌టైమ్ ఎంపికల్లో పనిచేసే రోజులకు అనుగుణంగా రూ.90,000 లేదా రూ.45,000 వరకు జీతం ఉంటుంది. కన్సల్టెంట్ పోస్టుకు పూర్తికాలపు జీతం రూ.1.20 లక్షలు కాగా, యంగ్ ప్రొఫెషనల్‌కు రూ.90,000 వరకు లభిస్తుంది. పార్ట్‌టైమ్ ఎంపికల్లో కూడా అనుపాతంగా జీతం అందుతుంది. ఎంపిక ప్రక్రియలో అభ్యర్థుల దరఖాస్తులను సమీక్షించి, తదుపరి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. చివరి నిర్ణయం కమిషన్‌కే ఉంటుంది, దాని నిర్ణయం తుది నిర్ణయంగా పరిగణించబడుతుంది.

# వేసవి ప్రయాణికులకు ఊరట వివిధ ప్రాంతాల మధ్య స్పెషల్ ట్రైన్స్!



ఈ వేసవిలో ప్రత్యేక రైళ్లను నడుపుతోంది రైల్వే. ఈ ప్రత్యేక రైళ్లలో ప్రయాణికుల సౌకర్యార్థం 2ఏసీ, 3ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయి. మీ ప్రయాణాన్ని ముందుగానే ప్లాన్ చేసుకుని టిక్కెట్లు రిజర్వ్ చేసుకోవాల్సిందిగా రైల్వే శాఖ సూచించింది.. వివిధ ప్రాంతాల మధ్య 'సమ్మర్ వీక్లీ స్పెషల్' రైళ్లువేసవి కాలంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే పలు గమ్యస్థానాల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. ఈ రైళ్లు ఏప్రిల్ నెలలో అందుబాటులో ఉంటాయి. ఈ సమ్మర్ సీజన్‌లో ప్రత్యేక రైళ్ల వల్ల ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలిగించనున్నాయి.

డ్రైవర్ల ఆటో, ట్యాక్సీ లైసెన్స్‌ల రద్దు.. ఆ ప్రభుత్వం కీలక నిర్ణయం.. అసలు మ్యాటర్ ఇదే!

ముఖ్యమైన రైళ్ల వివరాలు:

1. చెన్నై సెంట్రల్ సంత్రాగచ్చి చెన్నై బీచ్: ఏప్రిల్ 16న (గురువారం) ఉదయం 06.55 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది.

రైలు నం. 06068: ఏప్రిల్ 17న (శుక్రవారం) మధ్యాహ్నం 14.50 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి, శనివారం సాయంత్రం 18.30 గంటలకు చెన్నై బీచ్ చేరుకుంటుంది.

స్టాపింగ్స్: విజయవాడ, రాజమండ్రి, నెల్లూరు, గుడూరు, ఒంగోలు, దువ్వాడ, విజయనగరం వంటి ముఖ్య ప్రాంతాల్లో ఈ రైళ్లు ఆగుతాయి.

2. సహర్సా యశ్వంత్‌పూర్ సహర్సా: రైలు నం. 05551 ఏప్రిల్ 16 నుండి 30 వరకు ప్రతి గురువారం రాత్రి 20.25 గంటలకు బయలుదేరుతుంది. రైలు నం. 05552: ఏప్రిల్ 19 నుండి మే 3 వరకు ప్రతి ఆదివారం ఉదయం 07.00 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరుతుంది.

**ముఖ్యమైన స్టాపింగ్స్:** ఏపీ. తెలంగాణలోని విజయవాడ, గుంటూరు, మార్కాపురం రోడ్, నంద్యాల, ధోన్, గూటి, అనంతపురం, ధర్మవరం స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది.

**3. పోడనూర్ ఖరగ్‌పూర్ చెన్నై బీచ్:** రైలు నం. 06065 ఏప్రిల్ 16 (గురువారం) రాత్రి 23.00 గంటలకు పోడనూర్ నుండి బయలుదేరుతుంది.

**రైలు నం. 06066:** ఏప్రిల్ 18 (శనివారం) మధ్యాహ్నం 15.30 గంటలకు ఖరగ్‌పూర్ నుండి బయలుదేరుతుంది.

**స్టాపింగ్స్:** కాట్పాడి, రేణిగుంట (06065కు మాత్రం), నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ స్టేషన్లలో హాల్ట్స్ ఉంటాయి

కోచ్‌ల వివరాలు: ఈ ప్రత్యేక రైళ్లలో ప్రయాణికుల సౌకర్యార్థం 2AC, 3AC, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

# ఆత్మకూరు లో మొక్కలు నాటిన అధికారులు



**తాడిమర్రి,జూలై18.అక్షర టైమ్స్:**-తాడిమర్రి మండలంలోని ఆత్మకూరు నందు గల ప్రాథమిక పాఠశాల ప్రాంగణం నందు స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణఆంధ్ర లో భాగంగా పర్యావరణ పరిరక్షణ నిమిత్తం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొదటగా ఎంపిడిఓ వెంకట రంగారావు డిప్యూటీ ఎంపిడిఓ విజయ్ శేఖర్ నాయుడు, ఏపీఓ అనిల్ కుమార్ రెడ్డి,పాఠశాల హెడ్ మాస్టర్ నారాయణ స్వామి స్థానిక టీడీపీ నాయకులైన ముసుగు శ్రీనివాసులు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి రాములమ్మ, పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి ఫ్ ఏ తేజ మరియు టి ఏ అనురాధలతో కలసి మొక్కలు నాటిన తర్వాత ఎంపిడిఓ వెంకట రంగా రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షణ చేయాలని తద్వారా పిల్లలలో పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెరిగి క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. ప్రజలందరూ కూడా తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని గ్రామాన్ని కూడా స్వచ్ఛంగా ఉంచాలని డిప్యూటీ ఎంపిడిఓ విజయ్ శేఖర్ నాయుడు కోరారు. తదనంతరం అందరు కలసి స్వచ్ఛత గురించి ప్రతిజ్ఞ చేయడం జరిగింది.అత్మకూరు నందు గల ప్రాథమిక పాఠశాల ప్రాంగణం నందు స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణఆంధ్ర లో భాగంగా పర్యావరణ పరిరక్షణ నిమిత్తం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొదటగా ఎంపిడిఓ వెంకట రంగారావు డిప్యూటీ ఎంపిడిఓ విజయ్ శేఖర్ నాయుడు, ఏపీఓ అనిల్ కుమార్ రెడ్డి,పాఠశాల హెడ్ మాస్టర్ నారాయణ స్వామి స్థానిక టీడీపీ నాయకులైన ముసుగు శ్రీనివాసులు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి రాములమ్మ, పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి, ఫ్ ఏ.తేజ మరియు టి ఏ అనురాధలతో కలసి మొక్కలు నాటిన తర్వాత ఎంపిడిఓ వెంకట రంగా రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షణ చేయాలని తద్వారా పిల్లలలో పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెరిగి క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. ప్రజలందరూ కూడా తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని గ్రామాన్ని కూడా స్వచ్ఛంగా ఉంచాలని డిప్యూటీ ఎంపిడిఓ విజయ్ శేఖర్ నాయుడు

# అప్పు వివాదంలో దాడి కేసు నమోదు







తాడిపత్రి,జూలై18.అక్షర టైమ్స్:- మండలం పరిధిలోని చిన్నపొలమడ గ్రామంలో అప్పు వివాదం నేపథ్యంలో దాడి చోటు చేసుకున్నట్లు రూరల్ అప్ గ్రేడ్ సీఐ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు వివరించారు. కాగా చిన్నపొలమడ గ్రామానికి చెందిన గొంగటి రామలక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గొల్ల నాగభూషణంపై కేసు నమోదు చేశారు. అప్పుగా నుండి ఇచ్చిన డబ్బుల వ్యవహారం ప్రస్తుతం కోర్టు పరిధిలో విచారణలో ఉండగా, ఇదే వివాదం నేపథ్యంలో బాధితురాలిపై దాడి జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# వర్షాభావంతో పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు





**పామిడి,జులై18.అక్షర టైమ్స్:-** మండలంలోని గజరాంపల్లి గ్రామంలో శనివారం రైతులతో కలిసి ఎల్ నినో ప్రభావంపై పంటల పరిస్థితి అంచనా వేయుటకు శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారి జెడిఏ సాలురెడ్డి, ఎడిఎ వెంకటరాముడుమండలంలోని గజరాంపల్లి గ్రామంలో శనివారం రైతులతో కలిసి ఎల్ నినో ప్రభావంపై పంటల పరిస్థితి అంచనా వేయుటకు శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారి జెడిఏ సాలురెడ్డి వెంకటరాముడు ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులుపర్యటించారు. తీవ్ర వర్షభావ పరిస్థితులు ఉన్నందున పంటలు దిగుబడి ఇచ్చే అవకాశం ఉండకపోవడంతో ప్రతి రైతు తమతమ పంటలకు తప్పని సరిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలని, జిల్లా,మండల వ్యవసాయఅధికారి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరైతు మీసేవలోగాని, సర్వీస్ సెంటర్లలో గాని ఇన్సూరెన్స్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇన్సూరెన్స్ చేసుకోవడానికి జులై నెల 31 వరకు గడువు ఉందని తెలిపారు. రైతుల క్షేమం కోసం ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రతిపాదనలు ప్రోత్సహిస్తూ ఉన్నదని దీనివల్ల రైతుకు మంచి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అధికారులు పత్తి జొన్న ఎండిన వేరుశనగ పంటలను పరిశీలించారు.అలాగే రైతులు మాట్లాడుతూ వర్షాలు సమయానికి రాకపోవడంతో పంట దిగుబడి పెరగలేదని, ఎల్ నినో ప్రభావం చూపుతోందని రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు శాలురెడ్డి, వెంకటరాముడు, విజయ శంకర్ బాబు, సుమతి, సంపత్ కుమార్,రాధాకుమారి, నారాయణస్వామి, మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ తదితర అధికారులు శాస్త్రవేత్తలు రైతులు ప్రజలు పాల్గొన్నారు.

# ఆభరణాల ఎగుమతులు డౌన్.. మార్చిలో 35 శాతం తగ్గిన జెమ్స్, జ్యువెల్లరీ ఎక్స్‌పోర్ట్స్




ముంబై, ఏప్రిల్ 14 : దేశీయ ఆభరణాల ఎగుమతులకు యుద్ధం సెగ గట్టిగానే తగిలింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా దేశీయ జెమ్స్ అండ్ జ్యువెల్లరీ ఎగుమతులు 35 శాతం తగ్గుముఖం పట్టాయి. మార్చి నెలలో 27,717.40 మిలియన్ డాలర్లకు(రూ.2,44,827.26 కోట్లు) పరిమితమయ్యాయని ఇండస్ట్రీ బాడీ జీజేఈపీసీ తాజాగా వెల్లడించింది. కిందటేడాది ఇదే నెలలో 28,669.53 మిలియన్ డాలర్లు(రూ.2,42,559.39 కోట్లు)గా నమోదయ్యాయని జెమ్ అండ్ జ్యువెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం తగ్గుముఖం పట్టిన ఎగుమతులు వచ్చే రెండు నుంచి మూడు నెలల వరకు కోలుకునే అవకాశాలు లేవని, ప్రస్తుతం నెలకొన్న రాజకీయ అస్థిరత పరిస్థితులు దీర్ఘకాలికంగా కొనసాగితే ఎగుమతులు ఇప్పట్లో పుంజుకునే అవకాశాలు లేవని జీజేఈపీసీ వర్గాలు వెల్లడించాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సద్దుమణిగిన తర్వాతనే ఆభరణాల ఎగుమతులు పెరుగనున్నాయన్నారు. మరోవైపు, కట్ అండ్ పాలిష్ డైమండ్ల ఎగుమతులు కూడా 27.48 శాతం తగ్గి 838.75 మిలియన్ డాలర్లకు(రూ.7,798.82 కోట్లు) తగ్గాయి. క్రితం ఏడాది ఇదే నెలలో 1,156.60 మిలియన్ డాలర్లు(రూ.10,002.52 కోట్లు)గా నమోదయ్యాయి. 2025-26లో కట్ అండ్ పాలిష్ డైమండ్ల ఎగుమతులు 8.52 శాతం తగ్గి 12,159.83 మిలియన్ డాలర్లు(రూ.1,07,461.34 కోట్లు)గా నమోదయ్యాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 11,364.32 మిలియన్ డాలర్లు(రూ.1,00,277.64 కోట్లు) విలువైన బంగారు ఆభరణాలు ఎగుమతి అయ్యాయి. అంతక్రితం ఏడాది అయిన 11,367.42 మిలియన్ డాలర్ల(రూ.96,254.5 కోట్లు)తో పోలిస్తే తగ్గాయి. వెండి ఆభరణాల ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 52.21 శాతం ఎగబాకి 1,467.47 మిలియన్ డాలర్లకు(రూ.13,013.54 కోట్లు)కు చేరాయి. అంతక్రితం ఏడాది ఇది 964.10 మిలియన్ డాలర్లు(రూ.8,135.78 కోట్లు)గా ఉన్నాయి.'పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు జెమ్స్ అండ్ జ్యువెల్లరీ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపాయి. డైమండ్ ఎగుమతులు కూడా భారీగా పడిపోయాయి.

# నమ్మకమైన నేస్తం పటిష్టమైన బంధం.. రక్షణ, ఇంధన రంగాల్లో భారత్-రష్యా నూతన అధ్యాయం..!



మారుతున్న ప్రపంచ రాజకీయ ముఖచిత్రంలో భారత్-రష్యా సంబంధాలు కేవలం చారిత్రక బంధం మాత్రమే కాదు, అవి కాలపరీక్షకు నిలబడిన ధృడమైన భాగస్వామ్యమని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. ఇటీవల ఆయన ప్రముఖ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రక్షణ, ఇంధనం, వాణిజ్యం, దౌత్యపరమైన అంశాలపై ఆసక్తికర విషయాలను వెల్లడించారు. మారుతున్న ప్రపంచ రాజకీయ ముఖచిత్రంలో భారత్-రష్యా సంబంధాలు కేవలం చారిత్రక బంధం మాత్రమే కాదు, అవి కాలపరీక్షకు నిలబడిన ధృడమైన భాగస్వామ్యమని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. ఇటీవల ఆయన ప్రముఖ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రక్షణ, ఇంధనం, వాణిజ్యం, దౌత్యపరమైన అంశాలపై ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 2026 సెప్టెంబర్‌లో భారతదేశంలో జరగనున్న బ్రిక్స్ (దీ=×జూ) సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరవుతారని అలీపోవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రష్యా పర్యటన విజయవంతమైన నేపథ్యంలో, ఇప్పుడు పుతిన్ భారత్ పర్యటన కోసం ఇరు దేశాల ఉన్నత స్థాయి అధికారులు చర్చలు జరుపుతున్నారు. ప్రపంచ వేదికపై భారతదేశం పోషిస్తున్న నిర్ణయాత్మక పాత్రకు రష్యా పూర్తి మద్దతు ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు.రక్షణ రంగంలో ఇరు దేశాల మధ్య సహకారం కొత్త పుంతలు తొక్కుతోందని అలీపోవ్ తెలిపారు. మిగిలిన ఎస్-400 క్షిపణి వ్యవస్థను భారత్ త్వరలోనే అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. మేక్ ఇన్ ఇండియా సత్తాతో ముడిపడిన బ్రహ్మోస్ క్షిపణులు, ఏకే-203 రైఫిల్‌ల తయారీని రష్యా-భారత్ విజయగాథలుగా ఆయన అభివర్ణించారు. అత్యాధునిక ఎస్‌యు-57 యుద్ధ విమానాలపై భారత్ ఆసక్తి కనబరిచిందని, అయితే భద్రతా కారణాల దృష్ట్యా రక్షణ ఒప్పందాల పూర్తి వివరాలను గోప్యంగా ఉంచుతున్నట్లు అలీపోవ్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారత్‌కు రష్యా ఒక నమ్మకమైన ఇంధన భాగస్వామిగా కొనసాగుతోందన్నారు. ముడి చమురు, ఎల్‌పిజి సరఫరాలను రష్యా నిరంతరం కొనసాగిస్తుందని రాయబారి అలీపోవ్ హామీ ఇచ్చారు. "భారత్-రష్యా మధ్య 100 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాము. ఇది కొంచెం కష్టమైనా, ఖచ్చితంగా సాధించదగినదే." అని డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం చమురు కొనుగోళ్ల వల్ల వాణిజ్యం రష్యా వైపు మొగ్గు చూపుతోంది. దీనిని సమతుల్యం చేయడానికి వ్యవసాయ ఉత్పత్తులు, యంత్రాల ఎగుమతులను పెంచాలని భారత్‌ను రష్యా కోరుతోంది. ముఖ్యంగా, 95 శాతం వాణిజ్య లావాదేవీలు సొంత కరెన్సీల్లోనే జరుగుతుండటం వల్ల అమెరికా ఆంక్షల ప్రభావం గణనీయంగా తగ్గిందని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ ఆసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతలపై అలీపోవ్ స్పందిస్తూ, అమెరికా ఇజ్రాయెల్ దాడులను ఖండించారు. ఇరాన్‌కు ఆత్మరక్షణ చేసుకునే హక్కు ఉందని, శాంతియుత అణుశక్తిని ఉపయోగించుకునే హక్కును గౌరవించాలని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ దేశాల ఒత్తిడిని అధిగమిస్తూ, భారత్-రష్యా విశ్వాసం వ్యక్తం చేశారు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com